
సాక్షి గుంటూరు

గురువారం । 16 । ఫిబ్రవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0610 టీఎంసీలు. ఎగువ నుంచి 2,200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 2000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,217 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటీ కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్


వైభవం మల్లేశ్వరుడి గ్రామోత్సవం

రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామి



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బుధవారం స్వామి వారు రుద్రాక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుడిని దర్శించుకుని టెంకాయలు సమర్పించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూలమార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెదకోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన పొట్టి పానకాల గుప్తా, ఉదయ శ్రీనివాస్, మురళీకృష్ణ, ఉదయ్‌కుమార్, బాలగంగాధర్ గుప్తా, రంగ సత్యనారాయణ తదితరులు రుద్రాక్ష వాహన ఉత్సవానికి కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 556.90 అడుగుల వద్ద ఉంది. ఇది 225.2367 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 8,629, ప్రధాన కాలువకు 21,235, ఎస్ఎల్‌బీసీకి 2,200, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 42,424 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 29,796 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 832.50 అడుగుల వద్ద ఉంది. ఇది 52.1476 టీఎంసీలకు సమానం.

యార్డులో 1,38,237 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,30,195 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,38,237 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,000 నుంచి రూ.25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 86,336 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గమ్మ సేవలో మంత్రి కారుమూరి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం దర్శించుకున్నారు. మంత్రి నాగేశ్వరరావు దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు ఆశీర్వదించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలు మంత్రికి అందజేశారు.

అన్నదాతకు నష్టం చేస్తే సహించం

- రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించండి
- భూ రీసర్వేతో అనేక సమస్యలు పరిష్కారం
- నూతన జిల్లా పురోభివృద్ధి అభినందనీయం
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- గుంటూరు జిల్లా సమీక్ష సమావేశం



గుంటూరు జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు, వేదికపై రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, జేసీ రాజకుమారి, కమిషనర్ కీర్తి చేకూరి

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు వెస్ట్: రైతులకు ద్రోహం, నష్టం కలిగించే ఎటువంటి చర్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపేక్షించదని రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి ధర్మాన ప్రసాదరావు అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంత్రి ధర్మాన అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. విద్య, వైద్యం, వ్యవసాయం, జగనన్న గృహాలు తదితర అంశాలపై సుదీర్ఘ చర్చ నిర్వహించారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో నకిలీ విత్తనాల ద్వారా రైతులు నష్టపోయిన సందర్భాలు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రత్యేక బృందాల ఏర్పాటు ద్వారా అక్రమార్కుల ఆట కట్టించాలన్నారు. గత పాలకులు చేసిన ఎన్నో పొరపాట్లను, నిర్లక్ష్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరి చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి, ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలతో పాటు వైద్యులు, సిబ్బంది నియామకం, నూతన భవనాల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. భూ రీ–సర్వే తమ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయమన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు వెచ్చించిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 65 శాతం రీసర్వే పూర్తయిందని, డిసెంబర్ నాటికి మొత్తం పూర్తి చేస్తామనే ఆశాభావం వ్యక్తం చేశారు. జగనన్న ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సుమారు రూ.12 వేల కోట్లు వెచ్చించి భూసేకరణ చేశామని తెలిపారు. రానున్న ఉగాది నాటికి వీటిలో అనేక మంది గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత గుంటూరు వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మంత్రి ధర్మానను శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, అధికారులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలు ఉండవల్లి శ్రీదేవి, కిలారి రోశయ్య, మేకతోటి సుచరిత, ముస్తఫా, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్



ఎమ్మెల్యే శివకుమార్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

నకిలీ విత్తనాలపై నిఘా పెరగాలి

నకిలీ విత్తనాలు, పురుగు మందులకు సంబంధించి గతంలో విక్రయదారుడికి, రైతుకు, ప్రభుత్వానికి కలిసి ఒక అగ్రిమెంట్ ఉండేది. దీని ద్వారా నకిలీ విత్తనాల ద్వారా రైతులు నష్టపోతే వారికి పరిహారం అందేది. కానీ ప్రస్తుతం ఇది లేదు. దీనిని మళ్లీ పునరుద్ధరిస్తే రైతుకు మేలు జరుగుతుంది.

– ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ చీఫ్ విప్

నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతున్నారు

ప్రత్తిపాడులో 50 ఎకరాల్లో పంట వేసిన రైతు నకిలీ విత్తనాల వల్ల నష్టపోయాడు. ముఖ్యమంత్రి ప్రతి నియోజకవర్గంలో రూ.కోటితో అగ్రికల్చరల్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. విత్తనాలను ముందు అక్కడ చెక్ చేసి విక్రయాలు చేస్తే నష్టం నివారించవచ్చు. సొంత స్థలాలు ఉన్నవారికి జగనన్న ఇళ్ల పథకం వర్తిస్తే సులభంగా ఇల్లు కట్టుకుంటారు.

– మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు

తప్పించుకునే ధోరణిలో వైద్యులు, సిబ్బంది

తెనాలి నియోజకవర్గంలో మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు కావడంలేదు. ఫ్యామిలీ డాక్టర్ పథకంలో భాగంగా వల్లభాపురం గ్రామంలో 78 మంది ఔట్ పేషంట్లకు ప్రథమ చికిత్స అందించడంతో పాటు మందులు ఇచ్చామని రాశారు. నేను 8 మందికి ఫోన్లు చేసి విచారించగా వారిలో సగానికిపైగా రాలేదని తెలిపారు. తెనాలి పట్టణంలో 330 పడకల అత్యాధునిక వసతులతో కూడిన ఆసుపత్రి ఉండగా, చాలా కేసులను గుంటూరు జీజీహెచ్‌కు ఎందుకు పంపుతున్నారో సమాధానం చెప్పాలి. దీనిపై విచారణకు ఆదేశించండి.

– అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్యే, తెనాలి

అడుగు ముందుకు పడింది

గుంటూరు చానల్ విస్తరణకు అడుగు ముందుకు పడటం పట్ల జిల్లా యంత్రాంగానికి అభినందనలు. గుంటూరు నాజ్ సెంటర్ సమీపంలో జ్యోతిబాపూలే బీసీ స్టడీ సర్కిల్ పాత భవనంలోనే ఉంది. దీనికి రూ.7 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదు.

– కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

కల్చరల్ భవనాలను పూర్తిచేయాలి

సంస్కృతి మన జీవితంలో కీలక భూమిక పోషిస్తోంది. గుంటూరులో అంబేడ్కర్ భవనం అసంపూర్తిగా ఉంది. జాషువా భవనం, కల్చరల్ భవనాలు ప్రారంభం కాలేదు. ఈ భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి.

– డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ

రెండు దశాబ్దాల కల నెరవేరింది

తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో దాదాపు 20 ఏళ్ల నుంచి మంచినీటి సమస్య ఉంది. గత సమావేశంలో చర్చించగానే మున్సిపల్ కమిషనర్ స్పందించారు. కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేశారు. ఈ గ్రామాలకు మంచి నీరు అందించే ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు.

– కిలారి వెంకటరోశయ్య, ఎమ్మెల్యే, పొన్నూరు

వైద్యులు పూర్తి సమయం అందుబాటులో ఉండాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది పూర్తి సమయం విధులు నిర్వహించే విధంగా పర్యవేక్షించాలి. విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడంతో పాటు, వారికి ఉన్న రక్తహీనతను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్యే, తాడికొండ

జీజీహెచ్‌లో మందులు బయటకు రాస్తున్నారు

జీజీహెచ్‌లో కొన్ని మందులను బయటికి రాస్తున్నారు. కారణం ఏమిటి? మందుల కొరత ఉందా? 108 వాహనాలు సకాలంలో రావడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. 1200 మంది విద్యార్థులు కలిగిన అంజుమన్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి.

– మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్యే, గుంటూరు తూర్పు

డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని అందుబాటులోకి తేవాలి

మంగళగిరి ప్రాంతంలో డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అక్షయ పాత్ర ద్వారా పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. చేనేత కార్మికులకు మరికొన్ని కొత్త పరికరాలు అందించడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మరింత పెంపొందించవచ్చు.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

ఆనందరూపం.. అర్ధనారీశ్వరం

- దేశంలో తొలి విలక్షణ అర్ధనారీశ్వర శివలింగం
- పెదకొండూరులో క్రీ.శ. 4వ శతాబ్దిలో నిర్మాణం
- ఈశ్వరతత్వానికి ప్రతీక
- 1700 సంవత్సరాల క్రితం మలిచిన శివరూపం



అర్ధనారీశ్వర శివలింగం



విగ్రహం వద్ద డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

తెనాలి: శిరస్సుపై నాగాభరణం.. దిగువన అర్ధనారీశ్వర రూపం.. కుడివైపున కపాలముల మాల, త్రిశూలం, చెవికి సర్పకుండలం ధరించిన శివరూపం. ఎడమవైపు సగాన అందెలు, పూలమాల, చేతులకు కంకణాలు వంటి అలంకారంపై పార్వతి రూపం. మొత్తంమీద.. శివుడు పార్వతీ సమేతుడై ఆవిర్భవించినట్టు అక్కడి శివలింగం దర్శనమిస్తోంది. పార్వతీదేవికి శివుడిపై గల ప్రేమకు పరమావధి భర్త శరీరంలో సగభాగాన్ని పొందటమే. అందువల్లే ఈ శివలింగం సార్థకనామం కలదిగా చరిత్రకారుల భావన.

విలక్షణ శివలింగం..

శివలింగాలు నిరాకారంగా నిర్గుణసూచకంగా ఉండాలనే శైవాగమ శాస్త్రానికి భిన్నంగా విలక్షణమైన ఈ అర్ధనారీశ్వర శివలింగం, పవిత్ర కృష్ణానదీ తీరాన దుగ్గిరాల మండల గ్రామం పెదకొండూరులోగల ఆనందేశ్వరాలయంలో కొలువైఉంది. వేదాంతపరంగా చూస్తే, ఇందులో శివశక్తుల రూపం అద్వైత భావనకు ప్రతీకగా ఈశ్వరతత్వాన్ని చూపినట్టు చెబుతారు. శివాద్వైతం– శాక్తాద్వైతం ఇందులో మిళితమై ఉన్నాయి. శక్తి ఈశ్వరుడిలో మిళితమై ఉన్నప్పుడు ఈశ్వరాద్వైతమే మిగులుతుందని చెబుతారు. క్రీ.శ.4వ శతాబ్దినాటిది అంటే 1700 ఏళ్లనాటి ఈ విలక్షణ శివలింగం దేశంలోనే తొలిదని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి వెల్లడించారు.

పాలరాతితో మలచిన రూపు

ఈ శిల్పం ఉనికిని గురించి ప్రముఖ చరిత్రకారుడు పీవీ పరబ్రహ్మశాస్త్రి గతంలో ఇచ్చిన సమాచారం ప్రకారం బుధవారం డాక్టర్ శివనాగిరెడ్డి బుధవారం ఆలయాన్ని సందర్శించారు. అక్కడి శాసనాలను చదివి వివరాలను వెల్లడించారు. క్రీ.శ. 4వ శతాబ్దిలో గుంటూరు జిల్లా చేజర్ల, కంతేరుల నుంచి ఈ ప్రాంతాన్ని పాలించిన ఆనంద గోత్రినులనే రాజులు, పెదకొండూరులో ఆనందేశ్వరాలయాన్ని నిర్మించారు. పల్నాటి సున్నపురాతి శివలింగంపై ముందుభాగాన సగం శివుడు, సగం పార్వతిని ప్రకృతి, పురుషుల కలయికగా అర్ధనారీశ్వర శిల్పాన్ని చెక్కించారు. అర్ధనారీశ్వర శిల్పమున్న ఈ శివలింగం దేశంలోనే మొదటిదన్నారు. బౌద్ధమతానికి ప్రతీకగా శైవమతాన్ని ప్రచారంలోకి తీసుకొచ్చిన 4వ శతాబ్దిలోనే దీనిని నిర్మించినట్టు తెలిపారు. బౌద్ధ విగ్రహాల నిర్మాణాలకు వినియోగించిన పాలరాతితో ఈ శివలింగాన్ని మలిచారు. అమరావతి బౌద్ధశిల్పాలు, అమరేశ్వరస్వామి, ఆ ప్రాంతంలోని మరికొన్ని శిల్పఖండాలు ఇదే తెల్లరాతితో రూపొందించారు. పెదకొండూరు ప్రాంతంలో ఆనందేశ్వరుడు మినహా మరే తెల్లరాతి విగ్రహం లేదు.

చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజెప్పాలి

ఆలయ ప్రాంగణంలో క్రీ.శ. 12వ శతాబ్దినాటి బ్రహ్మ, సరస్వతి, మహిషాసురమర్ధిని, సూర్యవిగ్రహాలు, క్రీ.శ. 1170, 1173, 1317 నాటి శాసనాలున్నాయి. ఆ శాసనాలను పీఠాలపై నిలబెట్టి వాటి చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలియజెప్పే నామఫలకాన్ని ఏర్పాటు చేయాలని డాక్టర్ శివనాగిరెడ్డి గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ అక్రమాలపై కొరడా

- వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో రూ.25 లక్షలు స్వాహా
- విచారణ పూర్తి, చర్యలకు రంగం సిద్ధం
- ఇప్పటికే నంబూరు, చేబ్రోలు, చిలువూరు, మున్నంగి పంచాయతీలపై చర్యలు
- జొన్నలగడ్డలో పన్ను రసీదుల్లో డూప్లికేట్లు
- పంచాయతీ కార్యదర్శిపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలోని పలు పంచాయతీల్లో వెలుగుచూసిన అక్రమాలపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. అవినీతి బయటపడితే కఠిన చర్యలు తీసుకోవాలన్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఇప్పటికే పలు పంచాయతీల్లో సొమ్ము దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. తాజాగా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో అవినీతి వెలుగుచూసింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ సొమ్మును సొంతానికి వాడుకున్నాడు. సుమారు రూ.5 లక్షలకు పైగా గ్రామస్తుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్ను మొత్తాన్ని స్వాహా చేశాడు. మరో రూ.20 లక్షల వరకూ బిల్లులు లేకుండానే నగదు డ్రా చేశాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో విచారణ జరిపారు. అయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి విచారణకు సహకరించకపోవడం, డబ్బులు తిరిగి కట్టకపోవడంతో చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేశారు. గతంలో పెదకాకాని మండలం నంబూరు పంచాయతీలో రూ.2.99 కోట్ల అవినీతి జరిగినట్లు లెక్క తేలడంతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయడంతో పాటు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇద్దరు గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులను, ఇద్దరు బిల్ కలెక్టర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని చేబ్రోలు పంచాయతీ, కొల్లిపర మండలం మున్నంగి పంచాయతీ, వట్టిచెరుకూరు మండలం ముట్లూరు, దుగ్గిరాల మండలం చిలువూరు పంచాయతీలపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు. జొన్నలగడ్డ పంచాయతీలో కూడా అవినీతి వెలుగు చూసింది. పంచాయతీ కార్యదర్శి పన్నులు కట్టించుకోవడంలో కొత్త విధానానికి తెరలేపారు. ఒక బిల్లు పన్నుదారులకు ఇస్తే మరొకటి పంచాయతీ కార్యాలయంలో లెక్కలు రాసేందుకు వాడినట్లు విచారణలో తేలింది. ఒకరి వద్ద రెండు వేల రూపాయల పన్ను కట్టించుకుని వారికి ఆ మేరకు రసీదు ఇస్తే, పంచాయతీ ఆఫీసులో మాత్రం ఐదు వందల రూపాయలు మాత్రమే జమ చేశారు. ఇలా ఎంత మంది వద్ద ఎన్ని లక్షలు వసూలు చేశారన్నది ఇంకా లెక్క తేలాల్సిఉంది.

అవినీతిని సహించేది లేదు : కేశవరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి

పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా అవినీతికి పాల్పడితే ఎవరినీ సహించేది లేదు. నంబూరు పంచాయతీ అవినీతిపై కఠిన చర్యలు తీసుకున్నాం. ఏ పంచాయతీలోనైనా నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు డ్రా చేయడం, ఖర్చు చేయడం చేస్తే తీవ్రమైన చర్యలు తప్పవు.

పెండ్లి కుమారుడిగా అమరేశ్వరుడు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరారామంలో వేంచేసిఉన్న బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వేదపండితులు, అర్చకులు అమరేశ్వరుడిని పెండ్లి కుమారుని చేశారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో బాలచాముండికా సమేత అమరేశ్వరునికి విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత ఆలయ అనువంశిక ధర్మకర్త రాజావాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ తరపున పీసపాటి అమరేశ్వరశర్మ నేతృత్వంలో స్వామివారికి ఊరేగింపుగా కల్యాణోత్సవ పట్టువస్త్రాలను సమర్పించారు. అమరేశ్వరునికి వేకువజామున అభిషేకం చేసి నూతన వస్త్రధారణతో పెండ్లి కుమారుని చేశారు. శ్రీశుభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి నుంచి ఫాల్గుణశుద్ధ విదియ వరకు పాంచాహ్నిక దీక్షతో నిర్వహించే ఈ కల్యాణోత్సవాలకు అర్చకులకు ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమార్ చేతుల మీదుగా దీక్షా వస్త్రాలు సమర్పించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అమరేశ్వరుడికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, వాస్తుపూజ, వాస్తుహోమం, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ తెలిపారు.

19న ఎస్ఐ పోస్టుల ప్రిలిమినరీ పరీక్ష



మాట్లాడుతున్న ఐజీ త్రివిక్రమవర్మ, పక్కన సిద్ధయ్య, ఏఎస్పీ సుప్రజ తదితరులు

- జిల్లా వ్యాప్తంగా 23 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు
- ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 1:30 నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి
- గుంటూరు రేంజ్ ఐజీ వెల్లడి

నగరంపాలెం(గుంటూరు): ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లాలో జరగనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ ఆదేశించారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లపై బుధవారం ఐజీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతిస్తారని చెప్పారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు ఒక్క నిమిషం దాటినా లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు కార్డు, నలుపు/బ్లూ పెన్‌లను అనుమతిస్తారన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి అనుమతించేదిలేదని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, కేంద్రాల వద్ద గుంపులుగా ఉండరాదన్నారు. సమావేశంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), అనీల్‌కుమార్ (ఎల్అండ్ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఏఎన్‌యూ పరీక్షల సమన్వయకర్త సిద్ధయ్య, చీఫ్ ఇన్విజిలేటర్లు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ప్రతిభకు మార్కులు కొలమానం కాదు

- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- ముగిసిన జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- రాష్ట్రస్థాయికి 10 ప్రాజెక్టుల ఎంపిక



రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులతో జేసీ రాజకుమారి, మందపాటి శేషగిరిరావు, డెప్యూటీ మేయర్ సజీల, డీఈవో శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ప్రతిభకు మార్కులు కొలమానం కాదని జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శన-2023 బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యా-వైజ్ఞానిక ప్రదర్శనల్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయిలో ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులు వినూత్నమైన ఆవిష్కరణలతో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ పాఠశాల విద్యలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తున్న ప్రభుత్వం గ్రంథాలయ వ్యవస్థలో డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టిందని చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాల్ని అభివృద్ధి పర్చేందుకు విశేష కృషి చేస్తోందని తెలిపారు.

ఐదు అంశాల వారీగా ఉత్తమ ప్రాజెక్టుల ఎంపిక

జిల్లాస్థాయిలో ప్రదర్శించిన 85 ప్రాజెక్టుల్లో ఐదు అంశాల వారీగా ఉత్తమమైన 10 ప్రాజెక్టుల్ని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. వీటిని ఈనెల 27,28వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పాటు పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను జేసీ రాజకుమారి, మందపాటి శేషగిరిరావు, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఆర్జేడీ వి.ఎస్. సుబ్బారావు, డీఈవో పి.శైలజ, డీవైఈవో కె. సుధాకర్‌రెడ్డి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వచ్చిన ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు పి.అరుణ, ఎస్. అంకమ్మ, పి. లత, జె. శిరీష, విజయలక్ష్మి, సంతోష్‌కుమారి, విజయశ్రీని సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మరియారాణి, జిల్లా సైన్స్ అధికారి రాయపాటి శివనాగేశ్వరరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

నిందితుల అరెస్ట్

వినుకొండ(నూజెండ్ల): హత్య కేసులో నిందితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. మసీదు మాన్యంలో శ్రీగిరి కుమార్(38), భార్య స్వాతి నివాసం ఉంటున్నారు. ఇద్దరి మధ్య విభేదాలతో స్వాతి, ప్రియుడు మారుతీ బాబు కలసి ఈనెల 11న రాత్రి శ్రీగిరి మెడకు తాడు బిగించి హత్య చేశారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు.

ప్రకటన

[illegible]

కప్పెర నాగేంద్రబాబు, కె.విజయ్ కుమార్, న్యాయవాదులు, [illegible] విజయవాడ- 520003. ఫోన్: 9030799848.

డైట్ టెండరు ప్రకటన

ఆర్. సి. నెంబర్: 01/E1/2023 తేది:15.02.2023

[illegible] 17.02.2023 నుండి 25.02.2023 [illegible]

సం/- డాక్టర్ జి.హనుమంతరావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి [illegible]

బజరంగ్ ఫౌండేషన్ సేవలు అమూల్యం

- పోలీసు కుటుంబాలకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అభినందనీయం
- శిబిర ప్రారంభోత్సవంలో గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సుప్రజ



కంటి పరీక్ష చేయించుకుంటున్న అడిషనల్ ఎస్పీ సుప్రజ, చిత్రంలో బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



ఉచిత కంటి పరీక్ష, కళ్లజోళ్ల పంపిణీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): నిజమైన సేవకు భాష్యం చెబుతూ, నిండైన మానవత్వం చాటుకుంటూ మెండైన సేవలందిస్తున్న బజరంగ్ ఫౌండేషన్ కృషి అనన్య సామాన్యమని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) సుప్రజ అన్నారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీసులు, వారి కుటుంబాల కోసం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర పరీక్ష శిబిరాన్ని బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ(క్రైం) అనిల్, జిల్లా అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) శ్రీనివాసరావులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుప్రజ మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో వినూత్న రీతిలో ఉన్నాయని కొనియాడారు. సమాజ హితం కోసం ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, తలసేమియా పీడితుల కోసం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించిన ఫౌండేషన్ పోలీసుల కుటుంబాల కోసం ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ వ్యక్తిత్వాన్ని, దయా హృదయాన్ని కొనియాడారు. భవిష్యత్తులో పోలీసుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితోనే...

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో చేపడుతున్న 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' సేవా కార్యక్రమాల పరంపర కొనసాగుతోందని చెప్పారు. విధి నిర్వహణలో తమ జీవితాలను అంకితం చేస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేసిన నేత్ర వైద్య పరీక్ష శిబిరానికి భారీగా హాజరై, సద్వినియోగం చేసుకున్నందుకు పోలీసు కుటుంబాలకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రారంభమైన 'బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరం'లో గ్రామీణ ప్రాంతాలకు సేవలను విస్తరించి, ఏడాది చివరి నాటికి 51 గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలను పూర్తి చేసి సాధ్యమైనంత ఎక్కువమందిని భాగస్వాములను చేయాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో అనుక్షణం శ్రమించే పోలీసు సోదరులకు స్నేహహస్తాన్ని అందించడానికి బజరంగ్‌ఫౌండేషన్ సిద్ధంగా ఉందని, రాబోయే రోజుల్లో పోలీసు శాఖ ఏదైనా గ్రామంలో అవగాహన కార్యక్రమాలు లేదా సేవా కార్యక్రమాలు చేపట్టే సందర్భంలో ఆ బాధ్యతను బజరంగ్ ఫౌండేషన్ స్వీకరించడానికి ముందంజలో ఉంటుందని తెలిపారు. పోలీసు కుటుంబాలలోని మహిళలకు కూడా బజరంగ్ నారీ రుతువు కార్యక్రమం ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. 1056 మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేయడం జరిగిందని, అవసరం ఉన్న వారికి ఈ నెల 22వ తేదీ సాయంత్రం 3.30 గంటలకు కళ్లజోళ్లను అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే బజరంగ్ నారీ రుతువు కింద 376 మంది మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు శానిటరీ నాప్‌కిన్ల పంపకం చేయడం జరిగిందని వివరించారు. అనివార్య కారణాల వల్ల రాలేక పోయిన జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేక అభినందనలు, సందేశాన్ని పంపించారని ఆయన తెలిపారు.

అక్రమ క్వారీయింగ్‌పై మైనింగ్, విజిలెన్స్ దాడులు



అక్రమ క్వారీయింగ్ చేస్తున్న ప్రాంతంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు

శేకూరు(చేబ్రోలు): అక్రమ క్వారీయింగ్‌పై ప్రజల నుంచి ఫిర్యాదుల మేరకు మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు అధికారుల బృందం బుధవారం చేబ్రోలు మండలం శేకూరులో సంయుక్తంగా దాడులు నిర్వహించింది. మైనింగ్ విజిలెన్స్ ఏడీ కొండారెడ్డి, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, ఆర్ఐ రాజేంద్ర, అశోక్, మైనింగ్ సర్వేయర్ వసుమతి, వీఆర్వో మధుబాబు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు, పోలీసులు నిర్వహించిన దాడుల్లో రెండు ప్రొక్లెయినర్లు, ఐదు టిప్పర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. చేబ్రోలు మండలం శేకూరులో సర్వే నంబర్ 330, 335లోని భూముల్లో అనుమతులు లేకుండా అక్రమంగా క్వారీయింగ్ చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి ఆదేశాల మేరకు రెండు రోజులుగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్రమ క్వారీయింగ్ జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బుధవారం అధికారుల బృందం జరిపిన దాడుల్లో రెండు పొక్లెయినర్లు, ఐదు లారీల్ని సీజ్ చేసి తెనాలిలో డిపోకు తరలించారు. సుమారు 50వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తవ్వకం చేసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ క్వారీయింగ్ చేస్తున్న శేకూరు గ్రామానికి చెందిన ఇద్దరిపై మైనింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు



శివాలయం ముఖ ద్వారం



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

- పెదకాకాని శివాలయంలో సర్వం సిద్ధం
- 22వ తేదీ వరకూ ఉత్సవాలు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో 16నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రాంగణం అంతటా రంగురంగుల పందిళ్లు, తోరణాలతో కళకళలాడిపోతోంది. మహా శివరాత్రి పండుగ శోభ సంతరించుకుంది. విద్యుత్ కాంతుల్లో ధగధగలాడిపోతోంది. భక్తులకు అసౌకర్యం కలుగకుండా, స్వామిని దర్శించుకునే విధంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్ని 22వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. బ్రహ్మోత్సవాల ప్రారంభం పురస్కరించుకుని మాఘ బహుళ ఏకాదశి మూలా నక్షత్రం బుధవారం రోజున అమ్మవారు శ్రీ భ్రమరాంబాదేవిగా భక్తులను అనుగ్రహిస్తారు. ప్రత్యేక స్టేజీపై భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెగా, మల్లేశ్వరస్వామి పెండ్లి కుమారునిగా అలంకరించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళ్యాణం రోజున వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు, దాతల సహకారంతో అన్న సంతర్పణ, క్యూలైన్‌లలో మజ్జిగ, వాటర్ పంపిణీ, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. ఈ ఏడాది స్వామి కల్యాణానికి ఆలయ ప్రాంగణంలో స్టేజీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కల్యాణం అనంతరం భక్తులందరికీ జాకెట్టు ముక్క, తలంబ్రాలు, పసుపు కుంకుమ, లడ్డు ప్రసాదం ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజూ రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సమష్టి కృషితోనే తెలుగు భాషాభివృద్ధి



వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో లక్ష్మీపార్వతి తదితరులు

మంగళగిరి: అధికార భాషా సంఘం, తెలుగు, సంస్కృత అకాడమీలు సమన్వయంతో, సమష్టి కృషితో పని చేసినప్పుడే తెలుగు భాష అభివృద్ధి సాధ్యపడుతుందని తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అధికార భాషా సంఘం కార్యాలయంలో బుధవారం అధికార భాషా సంఘం సభ్యుడు కత్తి వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మీపార్వతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికార భాషా సంఘం సభ్యులుగా ప్రతిభ కలిగిన వ్యక్తుల్ని ఎంపిక చేశారని ప్రశంసించారు. గత ప్రభుత్వం తెలుగు అకాడమిని నిర్లక్ష్యం చేసిందని ఆమె విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో ముఖ్యమంత్రి, ఇతర ప్రభుత్వ పెద్దలు తనకు అప్పజెప్పిన బాధ్యతల్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికార భాషా సంఘం సభ్యులు జి. రామచంద్రారెడ్డి, మస్తానమ్మ, తవ్వ వెంకట సుబ్బయ్య, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ , ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

సీఎం అండతో సహకార బ్యాంకుల బలోపేతం

జీడీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము



సమావేశంలో మాట్లాడుతున్న జీడీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అండతో సహకార బ్యాంకుల్ని బలోపేతం చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము తెలిపారు. బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రాము అధ్యక్షతన మహాజన సభ సమావేశం బుధవారం నిర్వహించారు. ముందుగా బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి టి.కృష్ణవేణి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ సభలో ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం 10 తీర్మానాల్ని ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేశారు. పలువురు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సభ్యులు మాట్లాడుతూ రైతుల నుంచి వసూలు చేసే షేర్ ధనం శాతాన్ని 10 నుంచి ఐదుకు తగ్గించాలని కోరారు. బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము మాట్లాడుతూ నాబార్డు, ఆప్కాబ్ నిబంధనల ప్రకారం ఏ సొసైటీ అయినా కోటి రూపాయలు వ్యాపారం చేస్తే రూ.10 లక్షల షేర్ ధనం ఉండాల్సిందేనని తెలిపారు. గత పాలక మండలి సమయంలో బ్యాంకు వ్యాపార లావాదేవీలు రూ.2,400 కోట్లు కాగా, నేడు రూ.5,700 కోట్లకు చేరుకున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆప్కాబ్ సహకారంతో ప్రతి మండలానికి బ్రాంచిని ఏర్పాటు చేసేలా సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. సహకార సంఘాల ద్వారా ఇచ్చిన రుణాల్ని వసూలు చేయడంపై అధ్యక్షులు, సీఈఓలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సమావేశంలో బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు కె.హరిబాబు, ఎస్.రామయ్య, పి.వెంకటేశ్వరరావు, వి.అనిల్‌కుమార్, బ్యాంక్ జీఎం శేషభాను, అధికారులు, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సహకార సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి సీఎం కృషి

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలు



సేవాలాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు: గిరిజనుల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ ఆధ్వర్యంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి వేడుకలు బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కొందరు మహనీయులు చరిత్ర పుటల్లో అవతారపురుషులుగా, ఆరాధ్య దైవాలుగా నిలుస్తారని, సేవాలాల్ సైతం ఆ కోవకు చెందిన వారేనని కొనియాడారు. బంజారా జాతి ప్రజల శ్రేయస్సు కోసం ఆయన పాటుపడ్డారని తెలిపారు. పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్‌నాయక్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. అనంతరం సంప్రదాయ తలపాగాను ధరించి, నంగారాను మోగించి, సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భోగ్ భండారో కార్యక్రమాన్ని నిర్వహించి, బంజారా మహిళలు సంప్రదాయ దుస్తులతో నృత్యం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బత్తుల దేవానంద్, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ డైరెక్టర్ గనిక ఝాన్సీ, కార్పొరేటర్ బూసి రాజలత, పార్టీ గిరిజన విభాగం నేతలు దనావత్ వెంకటేశ్వర్లు నాయక్, రమావత్ భిక్కునాయక్, రమావత్ అంజినాయక్, కేతావత్ రూప్లా నాయక్ పాల్గొన్నారు.

ముస్తాబైన గోవాడ శైవక్షేత్రం



గోవాడలో బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ముఖ ద్వారం

గోవాడ (వేమూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో కోటప్పకొండ తర్వాత అత్యంత ప్రాముఖ్యం కలిగిన రెండో శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం. ఐదు రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం ఈ ఆలయం ప్రత్యేకత. పచ్చని పొలాల మధ్య, పూర్తి గ్రామీణ వాతావరణంలో భక్తుల మానసిక ప్రశాంతతను చేకూర్చే ప్రాంతం కావడంతో ఇక్కడ భక్తుల ఆదరణ ఎక్కువగా ఉంటుంది. దానికి తగినట్లుగా ఈనెల 18న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు దేవస్థానం ముస్తాబవుతోంది.

ఏర్పాట్లు ముమ్మరం..

గోవాడ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఈమని అశోక్ రెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు, వివిధ దర్శనాలకు ప్రత్యే క క్యూలైన్ల ఏర్పాటు, విద్యుద్దీకరణ పనులతో పాటు భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు మండలంలోని గోవాడలో బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తొలిరోజు దేవస్థా నం విద్యుత్ ప్రభను ఎత్తి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన తెల్లవారు జామున 5.13 గంటలకు బాల కోటేశ్వరస్వా మి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారు, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున దంపతులు సమర్పించనున్నారు. 20న సాయంత్రం స్వామి వారి రథోత్సవం, 21న తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
గురువారం ॥ 16-2-2023

'మా అమ్మా నాన్నలు ఇకపై నన్ను టీవీలో చూస్తారు' అని సంతోష పడింది మిన్ను మణి. దేశీయంగా ఆమె ఆడిన క్రికెట్ మేచ్‌లు టీవీలో టెలికాస్ట్ కాలేదు. 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం 30 లక్షలకు మిన్ను మణిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకున్నాక ఆమె ఆట తప్పక టెలికాస్ట్ కానుంది. రోజుకు నాలుగు బస్సులు మారి 52 కిలోమీటర్ల దూరంలోని క్రికెట్ స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసిన మణి కేరళలో ఈస్థాయికి ఎదిగిన తొలి గిరిజన మహిళా క్రికెటర్. మహిళా క్రికెట్ ఇప్పుడు విజయ పరంపరలో ఉంది. నిర్లక్ష్య వర్గాల నుంచి కూడా ఈ ఆటకు చేరొచ్చు అని చెబుతున్న మిన్ను మణిది కూడా ఒక విజయగాథ.

గిరిజన విజయం


మిన్ను మణి

'ముప్పై లక్షల రూపాయలు. నా జీవితంలో చూస్తానని అనుకోలేదు. మొదట నేనొక స్కూటీ కొనుక్కోవాలి. బస్సుల్లో తిరుగుతూ ప్రాక్టీసుకు ఇకపై వెళ్లను. ఆ తర్వాతే ఆ డబ్బుతో ఏం చేయాలో ఆలోచిస్తాను' అంది మిన్ను మణి.

ఫిబ్రవరి 13న ముంబైలో 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం మహిళా క్రికెటర్ల వేలం జరుగుతున్నప్పుడు మిన్ను మణి హైదరాబాద్‌లో సౌత్ జోన్ తరఫున ఇంటర్ జోన్ టోర్నమెంట్ ఆడుతోంది. ఆ రోజున 91 బాల్స్‌కు 74 కొట్టి నాటౌట్‌గా నిలిచింది. ఆట ఒకవైపు సాగుతూ ఉన్నా మనసంతా ముంబై ఆక్షన్ మీదే ఉంది.

'పెద్ద పెద్ద మహిళా క్రికెటర్లకు కూడా వేలంలో ధర పలకకపోతుండే సరికి నిరాశ కలిగింది. నా బేస్ ప్రైస్ 10 లక్షలు పెట్టారు. ఎవరూ తీసుకోరేమో అనుకున్నాను. కానీ ఢిల్లీ, బెంగళూరు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 30 లక్షలకు ఢిల్లీ కేపిటల్స్ నన్ను సొంతం చేసుకుంది. అప్పుడు నాకు కలిగిన ఫీలింగ్ మాటల్లో చెప్పలేను' అంది మిన్ను మణి.

'ఆ విషయం ఫోన్‌లో చెప్తే మా అమ్మా నాన్నలు డబ్బు గురించి కాక నా ఆట గురించి అడిగారు. టీవీలో వస్తుందా అన్నారు. వస్తుంది అని చెప్పాను' అంది సంతోషంగా.

కరూచియ

23 ఏళ్ల మిన్ను మణిది కేరళలోని వయనాడ్ జిల్లాలోని గిరిజన గూడెం. ఇది బ్రహ్మగిరి కొండల అంచున ఉంటుంది. మణిది 'కరూచియ' గిరిజన తెగ. వీళ్ల తమను తాము కొండ బ్రాహ్మణులుగా చెప్పుకుంటారు. తమ ఆచారాలు స్ట్రిక్ట్‌గా పాటిస్తారు. గురి చూసి బాణం వేయడంలో మేటిగా పేరు గడించారు. కాని ఇప్పుడు వారంతా చిన్న చిన్న పనులు చేసుకు బతుకుతున్నారు. మిన్ను మణి తండ్రి మణి రోజు కూలి. తల్లి వసంత గృహిణి. చిన్నప్పటి నుంచి మిన్ను మగపిల్లలతో కలిసి పొలాల్లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేది. ఎలిమెంటరీ స్కూల్లో రన్నర్‌గా ప్రతిభ చూపేది. 8 వ తరగతిలో హైస్కూల్లో చేరాక ఆమె ప్రతిభను ఆ స్కూల్లో ఎల్సమ్మ బేబీ అనే పీయూటీ టీచరు గుర్తించింది. 'మిన్ను రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్. రైట్ హ్యాండ్ బ్యాట్స్‌ఉమన్. బౌలింగ్‌లో బ్యాటింగ్‌లో ఆ అమ్మాయి టాలెంట్ చూసి చాలా దూరం వెళుతుందని అనుకున్నాను' అంటుంది ఆ పీయూటీ టీచర్. ఆ పీయూటీ టీచరే పూనుకుని తిరువనంతపురంలోని కేరళ క్రికెట్ అసోసియేషన్ దగ్గరకు తీసుకువెళితే వారు పరీక్షించి ట్రయినింగ్ ఇచ్చారు. దాంతో మిన్ను మణి ముందు వయనాడ్ జిల్లా జట్టుతో అటు పిమ్మట అండర్ 16 జట్టుతో ఆ తర్వాత కేరళ రాష్ట్ర మహిళా జట్టుతో ఆడటం మొదలుపెట్టింది.


తల్లి వసంతతో మిన్ను మణి

కష్టే ఫలి

అయితే మిన్ను మణి క్రికెట్ ఆడటానికి మొదట తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. 'కేరళలో అమ్మాయిలు అథ్లెట్లుగా రాణిస్తారు. నన్ను కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా చూడాలని మా అమ్మానాన్నలు అనుకున్నారు. క్రికెట్ మగవాళ్ల ఆట అని వారి అభిప్రాయం. కాని మా పీయూటీ టీచరు వారిని ఒప్పించి నన్ను క్రికెట్‌లోకి తీసుకెళ్లింది. నేను క్రికెట్ బాగా ఆడుతున్నానని తెలిశాక వారు మనస్ఫూర్తిగా ప్రోత్సహించసాగారు' అంది మిన్ను.

కానీ క్రికెట్‌లాంటి ఖరీదైన ఆటకు కావలసిన మంచి కిట్ కూడా మిన్ను దగ్గర లేదు. వాళ్ల నాన్న అప్పులు చేసి మిన్ను ఆట కొనసాగేలా చూశాడు. మిన్ను ప్రాక్టీసు చేయాలంటే వారి గూడేనికి 52 కిలోమీటర్ల దూరంలోని కృష్ణగిరి క్రికెట్ స్టేడియమే గతి. అంత దూరం వెళ్లడానికి మిన్ను తెల్లవారు జామునే లేచి ఇంటి పనుల్లో తల్లికి సాయం చేసి నాలుగు బస్సులు మారి స్టేడియంకు చేరుకునేది. తిరిగి ఇల్లు చేరే సరికి సాయంత్రం 7 అయ్యేది. 'అలిసిపోయేదాన్ని. కాని పట్టుదలగా ఆట కొనసాగించాను' అంటుంది మిన్ను.

ఆటలో విజయాలు

మిన్ను మణి కేరళ అండర్ 23లో ఆ తర్వాత భారత్ అండర్ 23 జట్టులో ప్రతిభ చూపింది. ఇండియా ఏ జట్టుకు ఎంపికై ఆడింది. విమెన్స్ ఆల్ ఇండియా ఒన్ డే టోర్నమెంట్‌లో 8 మేచ్‌లు ఆడి 246 పరుగులు చేసి 12 వికెట్లు తీసింది. దాంతో అందరి దృష్టి మిన్ను మీద పడింది. క్రికెట్ ఆడటం మొదలెట్టాక వచ్చిన కొద్ది పాటి డబ్బులో ప్రతి పైసా తన కోసం తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి ఉపయోగించింది. మిగిలిన డబ్బుతో చిన్న ఇల్లు కడితే 2018 వరదల్లో ఆ ఇల్లు దెబ్బతింది. క్రికెట్ అభిమానులు ఆదుకుని రిపేర్లు చేయించారు. ఇప్పుడు 30 లక్షల సంపాదన స్థాయికి మిన్ను చేరింది. 'దీని కంటే జాతీయ జట్టులో స్థానం పొందడమే నాకు ఎక్కువ ఆనందం. అదే నా లక్ష్యం' అంటోంది మిన్ను మణి.

బ్యూటిప్స్



మేకప్ ప్యాచ్‌లు కనిపించకుండా...

వయసు పైబడటం వల్ల చర్మం ముడతలు పడుతుంటుంది. మెడ, గొంతు ప్రాంతంలో చర్మం ముడతలు పడడాన్ని, చారికలు రావడాన్ని గమనించవచ్చు. ఈ సమస్య నివారణకు మెడ వ్యాయామం చాలా అవసరం. ఆకాశాన్ని చూస్తున్నట్టుగా తల పైకి ఎత్తి, తిరిగి నెమ్మదిగా కిందకు దింపాలి. ఇలా నాలుగైదు సార్లు చేయాలి. ఇలా రోజులో 5–6 సార్లుచేస్తూ ఉంటే మెడ దగ్గర చర్మం బిగుతుగా మారుతుంది. అలాగే మెడ, గొంతు దగ్గర మేకప్ వేసుకోవడానికి ముందు ఇలా చేయడం వల్ల మేకప్ ప్యాచ్‌లుగా కనిపించకుండా జాగ్రత్తపడవచ్చు.

మోచేతుల నలుపు తగ్గాలంటే...



- రోజూ స్నానానికి ముందు నిమ్మరసం రాసి, పది నిమిషాలు ఉంచాలి.
- టీ స్పూన్ కొబ్బరి నూనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి మోచేతులు, మోకాళ్లపై రాసి వేడి టవల్‌తో తుడవాలి.
- రెండు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ పంచదార కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్దాలి. ఇలా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.
- రెండు టీ స్పూన్ల పెరుగులో కొద్దిగా బాదం పొడి కలిపి నలుపుగా ఉన్న చోట రాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- పాల మీగడలో చిటికెడు పసుపు రాసి, నలుపుగా ఉన్న చోటరాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- టొమాటో రసం లేదా దానిమ్మ రసం తేనె లేదా నూనెతో కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్ది, శుభ్రపరుచుకుంటే నలుపు సులువుగా తగ్గుతుంది.
- నువ్వుల నూనెలో చర్మాన్ని మృదువుగా ఉంచే సుగుణాలు పుష్కలంగా ఉన్నాయి. వారానికోసారి స్నానానికి నువ్వుల నూనె ఉపయోగించడం వల్ల చర్మానికి కావల్సిన ఫ్యాటీ యాసిడ్స్ అంది, మృదువుగా అవుతుంది.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోసెల కోసం బియ్యం, మినప్పప్పు నానబెట్టేటప్పుడు ముందే కడగాలి. నానిన తర్వాత గ్రైండ్ చేసేటప్పుడు కడగడం వల్ల విటమిన్లు నీటిలో పోతాయి. అంతే కాకుండా దుకాణాల్లో వాటికి పురుగుపట్టకుండా నిల్వ చేయడానికి కీటక నాశినులను గనుక వాడి ఉంటే కడగకుండా నానబెట్టినప్పుడు ఆ అవశేషాలతో కూడిన నీటినే బియ్యం, మినప్పప్పు పీల్చుకుంటాయి కాబట్టి అవన్నీ శరీరంలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది.



- కూరల్లో ఉప్పు ఎక్కువైనప్పుడు అందులో బంగాళాదుంప ముక్కలను వేయాలి. అధికంగా ఉన్న ఉప్పును పొటాటో పది నిమిషాల్లో పీల్చుకుంటుంది.
- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్‌స్పూను నెయ్యి కలపాలి.



- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్‌స్పూను కార్న్‌ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.

సైబర్ టాక్

ఆన్‌లైన్‌లో డబ్బులు పోతే ఏం చేయాలి?!

కూతురు పుట్టినరోజుకు డ్రెస్ కొనుగోలు చేసిన సౌమ్య ఫోన్ యాప్ ద్వారా పేమెంట్ చేసింది. అయితే, పేమెంట్ మోడ్‌కి వచ్చేసరికి డబ్బులు డెబిట్ అయినట్టు బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చింది కానీ, షాప్ యజమాని ఖాతాలో నగదు క్రెడిట్ కాలేదు. దీంతో ఒకటికి రెండు సార్లు పేమెంట్ చేసింది. ఫెయిల్ అయిన ట్రాన్సాక్షన్ అమౌంట్ రిటర్న్ అవుతుందిలే అని ఊరుకుంది. కానీ, అలా రిటర్న్ అయిన మెసేజ్ ఏమీ రాలేదు. ఆ అమౌంట్‌ను తిరిగి ఎలా పొందడం, లేకపోతే అంతమొత్తం ఎలా వదిలేయడం.. ఓ రెండు రోజులు ఆగి చూద్దామా.. ఇలాంటి సందేహాలతోనే సౌమ్యకు ఆ రోజు గడిచిపోయింది.

ఇటీవల స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తికి ఆన్‌లైన్ పేమెంట్స్ గురించి తెలిసిందే. పండ్లు, కూరగాయల బండి వద్ద కూడా యాప్ ఆధారిత పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంటుంది. ఇందుకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్ వంటి వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతుంటాం, ఇలాంటప్పుడు సర్వర్ సరిగ్గా పనిచేయకనో లేదా మరో కారణంగానో ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోయినప్పుడు లేదా ఆన్‌లైన్ నగదు మోసాల జరిగినప్పుడు ఏం చేయాలో ప్రతిఒక్కరికీ అవగాహన తప్పక ఉండాలి.

ఫిర్యాదులకు వేదిక

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (CFCFRM) అనేది భారతదేశంలో పౌరులు ఆర్థిక సైబర్ మోసాలను ఫిర్యాదు చేయడానికి ఒక వేదిక. ఆర్థిక సైబర్ మోసానికి సంబంధించిన సంఘటనలను నివేదించడానికి, నిర్వహించడానికి పౌరులకు అనుకూలమైన, సురక్షితమైన మార్గాన్ని అందించడం ఈ ప్లాట్‌ఫారమ్ లక్ష్యం. మోసానికి సంబంధించిన సంబంధిత పత్రాలు, సాక్ష్యాలను దీనిలో అప్‌లోడ్ చేయచ్చు. ఇది ఆర్థిక సైబర్ మోసాన్ని ఎలా నిరోధించాలనే దానిపై సమాచారం, మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. నివేదిక ఇచ్చాక, విచారణ కోసం సంబంధిత చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీకి పంపిస్తుంది. తగిన చర్య కోసం బ్యాంకింగ్ అధికారులకు పంపుతుంది. మోసగాడి ఖాతాలో బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంకు దానిని హోల్డ్‌లో ఉంచుతుంది. తర్వాత, ఫిర్యాదుదారు అధికారికంగా కోర్టుకు హాజరు కావాలి. ఆ పై డబ్బు బాధితుడి ఖాతాకు బదిలీ చేయబడుతుంది. ఈ స్థితిని ట్రాక్ చేయడానికి ఒక యంత్రాంగాన్ని అందిస్తుంది.

CFCFRM టోల్ ఫ్రీ నెంబర్: 1930

- వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలి (12 గంటల్లోపు)
- ప్రత్యామ్నాయంగా https://cybercrime.gov.in పోర్టల్‌కు లాగిన్ అయ్యి, ఫిర్యాదు చేయాలి.
- బ్యాంక్ అకౌంట్ నెంబర్, వాలెట్ యుపిఐ, లావాదేవీ ఐడీ, తేదీ, డెబిట్/క్రెడిట్ కార్డ్ నంబర్లు మొదలైనవి ఇవ్వాలి.
- సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, రసీదు సంఖ్యను ఎఫ్ఐఆర్‌గా మార్చవచ్చు.


RBI వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ : టోల్ ఫ్రీ నెం. 14448

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 'వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ పథకం' అందుబాటులోకి వచ్చింది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర ఎలక్ట్రానిక్ చెల్లింపు వ్యవస్థలకు సంబంధించిన వాటితో సహా అన్ని డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి వినియోగదారులకు ఒకే పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ అందించడం ఈ పథకం లక్ష్యం.

ఈ పథకం కింద, వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి, పరిష్కరించడానికి ప్రతి రాష్ట్రంలో ఆర్‌బిఐచే నియమించబడిన అంబుడ్స్‌మన్ ఉంటారు. ఫిర్యాదులను స్వీకరించడం, విషయాన్ని విచారించడం, ఫిర్యాదు సరైనదేనని తేలిన సందర్భాల్లో బాధిత వినియోగదారులకు పరిహారం అందించే అధికారం ఈ అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. అంబుడ్స్‌మన్ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేస్తారు. వారి నిర్ణయాలకు బ్యాంకింగ్ సంస్థలు కట్టుబడి ఉంటాయి.

దశల వారీగా నివేదించే ప్రక్రియ...

- సంబంధిత యుపిఐ సర్వీస్ ప్రొవైడర్ పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పె మొదలైన వాటిపై ఫిర్యాదు.
- టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి.
- https://cms.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ చేసి, ఫిర్యాదు ఇవ్వచ్చు.
- మీ ఫిర్యాదును CRPC@rbi.org కి ఇ-మెయిల్ చేయచ్చు. (బ్యాంక్ స్టేట్‌మెంట్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు / యుపిఐ, యాప్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు/ పంపిన, స్వీకరించిన ఫోన్ నంబర్లు రెండింటినీ జత చేయాలి)


ప్రతీకాత్మక చిత్రం

- బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంక్ దానిని హోల్డ్‌లో ఉంచుతుంది, తర్వాత ఫిర్యాదుదారు ఖాతాకు బదిలీ చేస్తుంది.

డబ్బులు ఇరుక్కుపోతే..

డబ్బులు బదిలి చేసినప్పుడు మన అకౌంట్ నుంచి డిడక్ట్ అయినా అవతలి వారికి వెళ్లకపోవడం, లేదా పేమెంట్ ఆగిపోవడం వంటివి జరిగినప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా యుపిఐ వివాదానికి పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు.

ప్రతి కస్టమర్ PSP యాప్ (పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు) / TPAP యాప్ (థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు)లో UPI లావాదేవీకి సంబంధించి NPCI పోర్టల్ https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanism లో ఫిర్యాదు చేయవచ్చు.

ఈ కింది కారణాల వల్ల మాత్రమే అభ్యర్థనలను ఇవ్వాలి..

(ఎ) ఖాతా నుంచి మొత్తం డెబిట్ అయ్యింది కానీ లబ్ధిదారునికి క్రెడిట్ కాలేదు (బి) ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యింది కానీ మొత్తం నగదు డెబిట్ అయ్యింది (సి) చేయాల్సిన ఖాతాకు కాకుండా వేరొక ఖాతాకు తప్పుగా బదిలీ అయ్యింది (డి) లావాదేవీ సమయం ముగిసింది కానీ ఖాతా నుంచి డెబిట్ అయ్యింది (ఇ) మోసపూరితమైన లావాదేవీ జరిగింది (ఎఫ్) నగదు లావాదేవీ పెండింగ్‌లో ఉండిపోయింది (జి) లావాదేవీ అసలు యాక్సెస్ అవలేదు (హెచ్) లావాదేవీ రిజక్ట్ అయ్యింది (ఐ) పరిమితిని మించి పొరపాటున లావాదేవీ జరిగింది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

● ఫెక్స్‌టింగ్!

'స్మార్ట్' వాదనలు అంత స్మార్ట్ కాదు!

భార్యాభర్తలు, జీవిత భాగస్వాముల మధ్య ఏదో అంశం మీద వాదోపవాదనలు, చిన్న చిన్న గొడవలు మామూలే. వాదన జరుగుతుండగా... ఆఫీసుకు వెళ్తూ తన పార్ట్‌నర్ నుంచి దూరంగా వెళ్తే గొడవ సద్దుమణగడం ఖాయం. కానీ మొబైల్ ఫోన్‌లో టెక్స్ట్ మెసేజీల రూపంలో అదే గొడవ అదే పనిగా కొనసాగితే...? ఇలా లైఫ్ పార్ట్‌నర్స్ మధ్య ఫైటింగ్ కాస్తా టెక్స్ట్ మెసేజీల రూపంలో కొనసాగడాన్ని 'ఫెక్స్‌టింగ్' అనే ధోరణిగా అభివర్ణిస్తున్నారు. మొబైల్స్ ఎన్నెన్నో కొత్త కొత్త రకాల ఫీచర్స్‌తో వస్తున్నాయి కాబట్టి వాటిని 'స్మార్ట్' ఫోన్స్ అన్నారు. కానీ 'ఫెక్స్‌టింగ్' అంత స్మార్ట్ కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




ప్రతీకాత్మక చిత్రం

'ఫెక్స్‌టింగ్' అంటే కేవలం జీవిత భాగస్వాముల మధ్య ఫైటింగ్ అనే కాదు... పేరెంట్స్, ఫ్రెండ్స్ మధ్య కూడా కావచ్చుకానీ... అత్యధికంగా ప్రభావం చూపేది భార్యాభర్తల మధ్యనే కావడంతో సాధారణంగా దాన్ని లైఫ్‌పార్ట్‌నర్స్‌కే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అత్యంత ప్రఖ్యాతమైన ఓ సెలబ్రిటీ కేస్‌స్టడీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య, అమెరికన్ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌ల దాంపత్యం వయసు 45 ఏళ్ల పైమాటే. ఇటీవల ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాము వాదించుకునేందుకు టెక్స్ట్ మెసేజీలు వాడతామని చెప్పారు. అందుకు ఓ వినోదాత్మక కారణం కూడా తెలిపారు. తమ ఘర్షణ, వాదోపవాదాలు అమెరికన్ సీక్రెట్ ఏజెన్సీకి తెలియకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటామని సరదాగా వెల్లడించారామె. అంటే అందరి గుట్టుమట్లు పసిగట్టే అత్యంత సమర్థమైన ఏజెన్సీనే బురిడీ కొట్టించడానికి ఆమె 'ఫెక్స్‌టింగ్'ను ఎంచుకున్నారన్న మాట.


జోబైడెన్, జిల్ బైడెన్

రెండు రకాల వాదనలు

ఫెక్స్‌టింగ్‌లో పార్ట్‌నర్స్ ఎదురెదురుగా ఉండరు కాబట్టి... ముఖ కవళికలూ. అందులోని ఆవేశాలూ, ఉద్వేగాలూ కనిపించవు. వాదన తాలూకు తీవ్రత అక్షరాల్లో అంతగా ప్రభావ పూర్వకంగా కనిపించదు కాబట్టి అంత హానికరం కాదనీ అనేవాళ్లూ ఉంటారు. అంతే కాదు... ఆ వాదన కొనసాగడానికి ఇష్టపడని వారు... టెక్స్ట్‌కు బదులుగా క్రమంగా 'స్మైల్' లేదా షేక్‌హ్యాండ్ ఎమోజీల్లాంటివి ఉపయోగిస్తూ పోతే, ఎదుటివారి నుంచి తగినంత ప్రతిస్పందన లేకపోవడంతో క్రమంగా వాదన సన్నగిల్లిపోతుందనీ, ఎదురుబొదురు ఉన్నప్పటంత హాని జరగకపోవచ్చనీ కొందరు చెబుతుంటారు.

సరిగ్గా దీనికి పూర్తి భిన్నంగా వాదించే వారూ ఉంటారు. మాటలు తడబడవచ్చు. ఏదో మాట సరిగా వ్యక్తం కాకపోవచ్చు. కానీ సరిగ్గా వ్యక్తీకరించగలిగేవాళ్లైతే రాతలోనే ప్రభావం ఎక్కువ అని చెప్పేవాళ్లూ ఉన్నారు.

> ఎప్పుడైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు ఎదురుబొదురుగా ఉండి మాట్లాడుకోవడమే మంచిది. కొన్ని పదాలు, పంక్చువేషన్లు, ఎమోజీల వల్ల దురభిప్రాయాలు వచ్చే అవకాశమూ ఉంది. మాటల్లో చెప్పుకునే విషయాలను రాతలో పెట్టినప్పుడు అది మరింతగా హాని చేసే ప్రమాదం ఉంది. 'మీ అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు. కానీ మీ అభిప్రాయానికి విలువివ్వాల్సిందే' అనే పరస్పర గౌరవ భావన, దృక్పథాల వల్లనే మంచి ఫలితాలు వస్తాయి.
> – డాక్టర్ సుజాత రాజమణి, మానసిక నిపుణులు



పాతగాయాలూ రేగే ప్రమాదం

దంపతుల మధ్య సంభాషణల రూపంలో ఎదురుబొదురుగా ఘర్షణలు జరుగుతున్నప్పుడు ఏదైనా మాటతూలినా గాలికి పోయే మాటల వల్ల ఆ తర్వాత ఎలాంటి ప్రభావమూ ఉండదు. కానీ 'రాత' ఎప్పటికీ నిలిచిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఆ తర్వాత ఎప్పుడో చదువుకున్నప్పుడూ పాత మాటలూ, పాత వాదనల ప్రభావాలు కెలికినట్లుగా అయి, అవి ఆ తర్వాతెప్పుడో కూడా ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని మరికొందరు చెబుతున్నారు.

అంతులేకపోవచ్చు... ఆ అంశమే ప్రమాదం తేవచ్చు...

పొద్దున్నే భార్యాభర్తల మధ్య వాదన చెలరేగింది. ఇద్దరూ తమ తమ పనులు చేసుకుంటూనే వాదనల్లో మునిగిపోయారు. ఆఫీసుకు బయల్దేరే సమయానికి ఘర్షణ పెద్దదైంది. కానీ ఆఫీసు సమయానికి ఎవరి దారిలో వాళ్లు వెళ్లిపోవడంతో ఆ 'వాదోపవాదాలు' అక్కడితో ముగుస్తాయి. కానీ 'ఫెక్స్‌టింగ్' అలా కాదు. ఆఫీసుకు వెళ్లే దారిలో బస్సులోనో, ఆటోలోనో లేదా మెట్రోరైల్ లోనో అలాగే కొనసాగవచ్చు. అంతేకాదు... ఆఫీసుకు చేరి, సీట్లలో కూర్చున్నాక కూడా అదేపనిగా కొనసాగితే ప్రమాదమే. ఆ మాటకొస్తే కీలకమైన మీటింగుల్లోనూ 'టెక్స్ట్ మెసేజు'లు కొనసాగుతూ... అసలు లక్ష్యానికి అడ్డంగా మారవచ్చు. టెక్స్ట్ వల్ల ఒనగూరే సౌలభ్యమల్లా వాదన మౌనంగా కొనసాగుతూ... అది మాటల ద్వారా బయటకు తెలియదంతే. కానీ పని ప్రదేశంలో... చేయాల్సిన పని వదిలేసి అదేపనిగా వాదులాడుకుంటూ పోతే... ఆఫీసులో పూర్తి చేయాల్సిన పనులు కొనసాగకపోగా / జరగకపోగా... అదే ఇబ్బంది తెచ్చిపెట్టే ప్రమాదమూ ఉందంటున్నారు కపుల్ కౌన్సెలింగ్ నిర్వాహకులు, మనస్తత్వ నిపుణులు. అంతేకాదు... అది పనితీరుతో పాటు, బంధాల విషయాల్లోనూ ప్రమాదం తెచ్చిపెట్టవచ్చునని హెచ్చరిస్తున్నారు.

వస్తువులో కాదు... అంతా మన విచక్షణలోనే ఉంది...

''ఏదైనా ప్రయోజనం అన్నది ఆ వస్తువును మనం ఉపయోగించే తీరులో లేదా మన విచక్షణను బట్టే ఉంటుందిగానీ... ఉపకరణంలో ఏమీ ఉండదు. ఇంగ్లిష్‌లో చెప్పాలంటే 'ఆబ్జెక్ట్'లో కాకుండా 'ఆబ్జెక్టివ్'లోనే అంతా ఉంది'' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు కొందరు మనస్తత్వ నిపుణులు.